క్లుప్తంగా

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కుమార్‌గౌడ్



కుమార్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: మండలకేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ వై. కుమార్‌గౌడ్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియామకం అయ్యారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పార్టీ నాయకుల సమక్షంలో కుమార్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ మరింత బలోపేతం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియామకమైన కుమార్‌గౌడ్‌కు పలు మండలాల నాయకులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్, జెడ్పీటీసీ బొల్లం మణికంఠ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, నాయకులు ఉన్నారు.

మండల కోఆర్డినేటర్‌గా రమ్య

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండకు చెందిన తిప్పారపు రమ్యబాబురావు బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆదివారం రమ్యకు నియామకపు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ మండలంలో బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జవాన్లు

జనగామ రూరల్: ఖమ్మం జిల్లాకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ జి.రవికుమార్‌కు ప్రమాదవశాత్తు గాయపడి కోమాలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ పారా మిలిటరీ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో జనగామ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌కు చెందిన జవాన్ల సహకారంతో రూ. 80 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాల వారిగా సహాయం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జనగామ సొసైటీ అధ్యక్షుడు దేగల సంపత్, హతిరాం, గణేష్ తదితరలు ఉన్నారు.

పుస్తె, మట్టెల కోసం..



జఫర్‌గఢ్: కూనూర్ గ్రామానికి చెందిన శ్రీజ వివాహానికి పుస్తె, మట్టెల కోసం రూ.10,116 ఆర్థికసాయాన్ని హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఫౌండర్ హిమజారెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు మృతి చెందిన శ్రీజను అమ్మమ్మతాతయ్య పోషిస్తున్నారని తెలిపారు. కాగా, పెళ్లి నిశ్చయం కావడంతో సంస్థ ఫౌండర్ హిమజారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే ఆయన స్పందించి పుస్తె, మట్టెల కొనుగోలుకు ఆర్థికసాయం పంపించారని చెప్పారు. ప్రతినిధులు, గ్రామస్తులు దాత హిమజారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పల్లె రాజిరెడ్డి, గాదెపాక భాస్కర్, చల్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

చిల్పూరు: మండలంలోని లింగంపల్లికి చెందిన పెండ్లి నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఏదునూరి రవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2వేల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. రచ్చ రవీందర్, గొడుగు కొంరయ్య, రవి, వెంకటయ్య, ఉప్పలయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

బహిరంగ వేలం

బచ్చన్నపేట: మండలంలోని కొడ్వటూర్ దేవస్థాన వ్యాపార, తలనీలాల, ప్రసాదాల విక్రయ, కొబ్బరి ముక్కల సేకరణ తదితరాల వేలంపాటలు ఈనెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఈఓ చిందం వంశీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ తెలంగాణ ఉత్తర్వుల మేరకు నిర్వహించే బహిరంగ వేలంలో టెండరుదారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



స్టేషన్‌ఘన్‌పూర్: రైతులతో కలిసి మాట్లాడుతున్న రమేష్



పాలకుర్తి: మాట్లాడుతున్న సారయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో గత మూడు రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు. ఇప్పగూడెం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం నాయకులు ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత మూడు రోజుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోయినా సంబంధిత అధికారులకు పట్టడం లేదన్నారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండగా ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పసునూరి మల్లారెడ్డి, రొడ్డ రాజయ్య, వంగపండ్ల సోమయ్య, తొడెంగల ఐలయ్య, మల్లారెడ్డి, నాగరాజు, కుమార్, నాగేష్, సోమేశ్వర్, కొమురయ్య, రాజు, మల్లయ్య, మధు, యాకయ్య, గురుస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు: కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోయిన ధాన్యాన్ని అధికారులు వెంటనే కొనుగోలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు ఆగమేఘాల మీద ప్రారంభించి చేతులు దులుపుకున్నారే తప్ప రైతుల ఇబ్బందులను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సాదం శ్రీనివాస్, పోలు సంపత్, గద్ద కుమార్, రవి, మహేష్, రాజు, శ్రీనివాస్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనాలి

పాలకుర్తి: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో చిట్యాల ఐలమ్మ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో పెట్టుబడి పెట్టి రైతులు కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడిసిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. చిట్యాల సోమన్న, సోమసత్యం, నాగయ్య, సత్యం, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

'కల్వర్టు పనుల్లో నాణ్యతలోపం'



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో పాలకుర్తికి వెళ్లే రోడ్డులో చేస్తున్న కల్వర్టు పనులు ఇష్టారాజ్యంగా నాణ్యతా లోపంతో చేస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి తోట రమేష్, నాయకులు చల్లా సత్తిరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద చేపట్టిన రోడ్డు కల్వర్టు పనులను వారు ఆదివారం పరిశీలించి మాట్లాడారు. శివునిపల్లి నుంచి పాలకుర్తికి వెళ్లే రోడ్డులో ప్రత్యామ్నాయంగా సరైన రోడ్లు వేయకుండా ఇష్టారాజ్యంగా రోడ్డుపై తవ్వకాలు చేసి కల్వర్టు పనులు చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణానికి నాసిరకమైన పైపులను వినియోగిస్తున్నారని, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు.

ఎమ్మెల్యేల చిట్టాను బహిరంగపర్చాలి



మాట్లాడుతున్న ఏలియా

స్టేషన్‌ఘన్‌పూర్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టాను సీఎం కేసీఆర్ తక్షణమే బహిరంగ పర్చాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నలిమెల ఏలియా డిమాండ్ చేశారు. ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతుండగా ఆదివారం దీక్షను ఏలియా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధులో అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను శిక్షించకుండా సీఎం కేసీఆర్ వెనకేసుకురావడంలో ఉద్దేశ్యమేమిటని, అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సుధాకర్, రవీందర్, ఇసాక్, గాదె శ్రీధర్, నలిమెల నాగరాజు, ఆరూరి శ్రీనివాస్, ఎల్లయ్య, సురేష్, భిక్షపతి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతలకు బోనాలు



రఘునాథపల్లి: బోనాలతో వెళ్తున్న మహిళలు



దేవరుప్పుల: బోనాలతో మహిళలు

రఘునాథపల్లి: మండలంకేంద్రంలో కొనసాగుతున్న గ్రామ దేవతల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గౌడ కులస్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం, బోనాలు చేశారు. మధ్యాహ్నం గౌడ వర్గానికి చెందిన మగవారు నూతన పట్టు వస్త్రాలు ధరించి నీళ్ల బిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని జలాభిషేకం చేశారు. సాయంత్రం డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని కంఠమహేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. గౌడ కులపెద్దలు దుబ్బాక నాగేష్‌గౌడ్, మల్కపురం చంద్రమౌళిగౌడ్, బాల్నె నాగభూషణంగౌడ్, కోళ్ల రవిగౌడ్, దుబ్బాక రమేష్, రంగు రాజు, దుబ్బాక యాదగిరి, మహేందర్, యాకయ్య, అన్వేష్, హరీష్ పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన

దేవరుప్పుల : మండల కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనతోపాటు దుర్గామాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. దేవరుప్పుల వంతెన సమీపంలో ట్రాఫిక్ స్తంభించడంతో మూడు గంటలపాటు హైరానా పొందారు. ఎట్టకేలకు పోలీసులు చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఉత్సవాల నిర్వహణకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు సర్పంచ్ రమాదేవినర్సింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



స్టేషన్‌ఘన్‌పూర్: కలశ ప్రతిష్ఠాపన పూజలో గౌడ కులస్తులు

కలశ ప్రతిష్ఠాపన పూజ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెంలో నిర్వహిస్తున్న గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠమహేశ్వరస్వామి–సురమాంబదేవి, రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘనంగా కలశ ప్రతిష్ఠాపన పూజను నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో కమిటీ బాధ్యులు, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై పూజ చేపట్టారు. పూజలో కల్యాణ ఉత్సవ కమిటీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, గౌరవ అధ్యక్షురాలు, ఎంపీటీసీ గండి విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల యాకయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు చట్ల యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్లు రవీందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీఎస్పీ శ్రేణులు



దేవరుప్పుల: బడుగు బలహీన వర్గ రాజ్యస్థాపనకు ఉద్యమించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో తెలంగాణ భరోసా భారీ బహిరంగ సభకు బీఎస్పీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు జేరుపోతుల కుమార్, చంద్రశేఖర్, నాగుల అశోక్, మారయ్య, మల్లేషం, ఇస్సాక్, సుధాకర్, కుమార్, భిక్షపతి, రాజు తదితరులు ఉన్నారు.

ఆంగ్ల భాషలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వంశీ

బచ్చన్నపేట: ప్రతీ విద్యార్థి ఇష్టంతో చదివి ఆంగ్ల భాషలో ప్రావీణ్యం పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని డాక్టర్ వంశీ అన్నారు. టీఎస్ యూటీఎఫ్ పూలే అధ్యయన వేదిక సంయుక్తంగా నిర్వహించిన ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల ముగింపు సమావేశం మాడిశెట్టి కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఆ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వంశీ మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా లక్ష్య సాధనదిశగా అడుగులు వేయాలని తెలిపారు. రెండో విడత తరగతులు 9 నుంచి 15 వరకు పాలకుర్తిలో నిర్వహింపబడతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస రావు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి గుండె కనకయ్య, బేతి శ్రీధర్, త్రివిక్రమ రావు, ఎస్ఎంసీ చైర్మన్ గొల్లపల్లి బాపురెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

పాలకుర్తి టౌన్: టీఎస్ యూటీఎఫ్, పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 15 వరకు పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇచ్చే ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని కోచింగ్ ఇన్‌చార్జ్ చిక్కుడు శ్రీనివాస్, అకాడమీ సెల్ కన్వీనర్ తోట వెంకట్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్న స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ గ్రామీణ విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సాగ నర్సయ్య, చత్రుత ఈ స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తారని తెలిపారు. బాబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మె



నర్మెట: నినాదాలు చేస్తున్న కార్యదర్శులు



దేవరుప్పులలో..



రఘునాథపల్లి: వంటావార్పుతో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

నర్మెట: న్యాయమైన డిమాండ్ల సాధనకోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం ముగిసినా తమను రెగ్యులరైజ్ చేయకపోవడం విచారకరమని సంఘం అధ్యక్షుడు దామెర వంశి, ప్రధాన కార్యదర్శి కానుగంటి సుఖేష్ అన్నారు. పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, ఉపాధిహామీ పనులు, పారిశుధ్య, తాగునీటి సరఫరా, హరితహారం, నర్సరీలు, పలు అభివృద్ధి పనుల్లో కీలంగా విధులు నిర్వహిస్తున్నా తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఆరె గిరి, అనందాసు కల్యాణి, శాడగొండ అనిల్, ముక్కల నరేష్, శివరాత్రి యాకూబ్, వలబోజు సురేష్, చింతపండు పవన్ తదితరులు ఉన్నారు.

ప్లకార్డులతో కార్యదర్శుల నిరసన

దేవరుప్పుల : పంచాయతీ జూనియర్ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్‌లతో కూడిన ప్లకార్డులతో ఆదివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద 10వ రోజు దీక్షబూని నిరసన తెలిపారు. అమరేందర్, శ్రీకాంత్, అనిల్, శ్వేత, ఫర్హానా, అశ్విని, సంధ్యరాణి, వాణిశ్రీ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

బచ్చన్నపేట: ప్రభుత్వం వెంటనే స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ ఆచార్య డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరింది. ప్రభుత్వం విధించిన ప్రొబేషనరీ కాలం ముగిసినా రెగ్యులరైజ్ చేయకపోవడం విచారకరమని అన్నారు. సమ్మెలో రాధాకృష్ణ, రుబీనా, కిరణ్ కుమార్, కవిత, రాజశేఖర్, రేవతి, సతీష్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల వంటావార్పు..

రఘునాథపల్లి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా జేపీఎస్‌లు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జేపీఎస్‌ల శ్రమను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జేపీఎస్‌లు చేస్తున్న సమ్మెలో కుటుంబ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

యువ సంఘర్షణ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న సురేష్‌నాయక్

కొడకండ్ల: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో సోమవారం నిర్వహించే యువ సంఘర్షణ సభకు ప్రియాంకగాంధీ హాజరవుతున్నందున మండలం నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగులు, యువత తరలిరావాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ ఖాళీల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రవీందర్, మహేందర్‌రెడ్డి, అంజయ్య, ఖలీం, యాకేష్, శ్రీనివాస్, వంశీకృష్ణ, రంగయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రఘునాథపల్లి: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



బచ్చన్నపేట: పోచన్నపేట ఉన్నత పాఠశాల 2008-09 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ కరచాలనాలతో పట్టరాని ఆనందంతో గడిపారు. చిన్న నాటి చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. తమను విద్యావంతులుగా తీర్చిదిద్ది ఎదుగుదలకు కారకులైన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రమేష్, నరేష్, సతీష్, అనిల్, రాంబాబు, రాదాకృష్ణ, వాసుదేవ్, రవి, అరవింద్, మంజుల, సంధ్య పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట ఉన్నత పాఠశాల 2008–09 పదోతరగతి బ్యాచ్‌కు విద్యార్థులు ఎస్‌వీ గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు రవీందర్ అశోక్, సరస్వతి, రమేష్‌బాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వం పొందాలి



చిల్పూరు: కుల సంఘం సభ్యత్వాలను ప్రతి ఒక్కరూ పొందాలని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గజ్జెల దామోదర్ అన్నారు. మండలంలోని మల్కాపూర్, చిల్పూరుల్లో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో శాశ్వత సభ్యత్వ రుసుము రూ.1,000, సాధారణ సభ్యత్వంగా రూ.100 నిర్ణయించినట్లు తెలిపారు. కుసుమ రవి, రాజ్‌కుమార్, వెంకటేశం, రాజమౌళి, చంద్రయ్య, రాజన్‌బాబు, కుమారస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

22 నుంచి దుర్గమ్మ ఉత్సవాలు



చిల్పూరు: గ్రామ ప్రజలు, దాతల సాయంతో దుర్గమ్మ ఉత్సవాలను ఈనెల 22,23 తేదీల్లో నిర్వహించనున్నట్లు సర్పంచ్ బానోత్ రూప్లానాయక్, ఉత్సవ కమిటీ చైర్మన్ ధరావత్ రవి తెలిపారు. మండలంలోని ఫత్తేపూర్‌లో ఆదివారం దుర్గమ్మ గుడి ఆలయ పూజారి పిల్లి కొంరయ్య ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవాల తేదీలను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గమ్మ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉత్సవ కమిటీని ప్రకటించారు. వైస్ చైర్మన్ గట్టు మల్లు తదితరులు పాల్గొన్నారు.

మేరు సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

జఫర్‌గఢ్: మండలంలోని కోనాయిచలం గ్రామానికి చెందిన కొండ రమేష్ తెలంగాణ మేరు సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మండల కేంద్రంలో మేరు సంఘం మండల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా కొండ రమేష్ ఎన్నికవగా ఉపాధ్యక్షులుగా సంగా గోపాల్, పాడిశెట్టి రాజ్‌కుమార్, రామగిరి భిక్షపతి, రాపర్తి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా సంగా నరేష్, కార్యదర్శులుగా పాడిశెట్టి శ్రీనివాస్, మునిగాల ఏకాంబ్రం, రాపర్తి వెంకటేశ్వర్లు, సంగా శివరాజు, రాపర్తి రాజు, నిర్వాహక కార్యదర్శులుగా మునిగాల సతీష్, సంగా యుగేందర్, కొండ శ్రీనివాస్, కోశాధికారి సంగా మహేందర్‌తో పాటు తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు. కాగా, ఎన్నికల పరిశీలకులుగా ఆర్ రవీందర్, శ్రీనివాస్ వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



నర్మెట: గుర్తు తెలియని కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రం శివారు జనగామ రోడ్డుపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. అమ్మాపురానికి చెందిన పిట్టల అంజయ్య తన ద్విచక్రవాహనంపై జనగామ నుంచి నర్మెటకు వస్తున్న క్రమంలో నర్మెట వైపు నుంచి గుర్తుతెలియని ఎర్ర రంగు కారు జనగామ వెళ్తుంది. ఈ క్రమంలో నర్మెట–జనగామ రోడ్డుపై పౌల్ట్రీ ఫాం సమీపంలో కారు బైకు ఢీకొనడంతో అంజయ్య కుడి మోకాలు కింది భాగం విరిగింది. 108 అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రుడిని బంధువులు ప్రైవేట్ వాహనంలో చికిత్స నిమిత్తం జనగామకు తరలించారు.